బాధ తొణికిసలాడింది ఆమె గొంతులో.

అవాక్కయి చూస్తూ ఉండిపోయాడు అతను.

ఉన్నట్టుండి ఆమె అడిగింది-"అహల్య కథ మీకు తెలుసా శిల్పీ?" అని.

"గౌతమ మహర్షి కథ తెలుసు!"

"చిత్రంగా మాట్లాడుతారు మీరు!"

"శిల్పీ! ఇటు చూడండి!" వీపు మీద జాకెట్టు సడలించి చూపించింది. వీపు నిండా వాతలు పెట్టి ఉన్నాయి. అతను గతుక్కుమన్నాడు.

"ఏమిటివి?"

"నా భర్త నాకిచ్చిన బహుమానాలు!"

"గంగారాం గారు ఇలాంటివారా? మంచిగా కనిపిస్తారే?"

"అందరికీ మంచిగానే కనిపిస్తారు. కాని... కాని... నా పట్ల శాడిస్టు."

"నేను మీకు చెయ్యగల సాయం ఏదున్నా చేస్తాను!"

"నన్ను మీతో తీసుకుపోగలరా?"

తుళ్ళిపడ్డాడతను. క్షణకాలం ఆమె ముఖంలోకి చూస్తూ ఉండిపోయాడు.

"మాట్లాడరేం శిల్పీ?" ఈ పరిసరాలకి దూరంగా పారిపోవాలన్న తపన ఆమె అంతరాంతరాల నుంచి ప్రతిధ్వనించింది.

"ఆలోచిస్తాను!" ఆమె వీపు మీది వాతలకి కొబ్బరి నూనె పూస్తూ అన్నాడతను.

"ఏ సంగతీ రేపు. ఉదయం ఏటి ఒడ్డున చెప్పండి!" అంటూ తుర్రుమందామె.

ఆమె వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయాడతను.

** ** **

అతనా ఊరు వచ్చి కొద్ది రోజులే అయినా ఏదో విడదీయరాని బంధం ఏర్పడింది ఆ పరిసరాలతో. ఆ జీడి తోట, ఆ ఏరు, ఆ వాతావరణం ఏదో హాయి గొల్పుతూ ఉంటుంది.

డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగం సంపాదించుకోలేని నిర్భాగ్యుడు తను. పుట్టిన నాటి నుంచీ తనతోనే పెరిగి పెద్దదవుతూన్న కళాతృష్ణ తనని విచిత్రంగా ఇక్కడ బంధించింది. గంగారాం గారి ధర్మమా అని తిండికీ, గుడ్డకీ లోటు లేకుండా పోయింది.

కాని... కాని... అహల్య తనని కోరరాని కోరిక కోరింది. తను ఈ సాహసం చెయ్యగలడా? నాలుగు రోజులు గడిచాయి.

ఈ నాలుగు రోజులూ అహల్యకి మొహం చాటుచేశాడు. అహల్య తనని పిరికివాడుగా భావిస్తుందా?

అతని మనస్తత్వం మొద్దుబారిపోయింది.

తనిప్పుడు ఏ నిర్ణయం తీసుకోవాలి? తనకు తానుగా అందివస్తున్న సౌందర్యరాశి! తన కళా తపనకి ఆలంబన. ఆమెని స్వీకరించాలన్న దృఢమైన నిర్ణయం అతని అంతరంగంలో చోటు చేసుకుంది.

మర్నాడు ఉదయం ఆమె ఏటికి వచ్చినప్పుడు చెప్పాడు అతను. "ఈ రాత్రికి మనం వెళ్ళిపోదాం! సరిగ్గా పన్నెండు గంటలకి రండి!"

ఆమె ముఖంలో కోటి జ్యోత్స్నల కాంతులు వెల్లివిరిశాయి.

తనతో ఇక్కడికి తెచ్చినది ఏమీ లేదు. అపురూపంగా, మనోజ్ఞంగా చిత్రించిన చిత్రం మాత్రం ఉంది. దాన్ని గుడ్డలలో చుట్టి భద్రపరిచాడు.

గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

అహల్య కోసం ఎదురు చూస్తున్నాడు అతను. అహల్య రాలేదు. కానీ... గంగారాం వచ్చాడు.

"కుర్రాడా! వెళ్ళిపోతున్నావటగా?"

ప్రశ్నార్థకంగా చూశాడు శిల్పి.

"నాకు తెలుసు! అహల్య ప్రవర్తన పసిగట్టాను. సంఘంలో నా పరువు తియ్యొద్దు. ఇవి చేతులు కావు కాళ్ళనుకో! ఈ డబ్బు తీసుకుని పారిపో! మళ్ళీ ఎప్పుడూ కనిపించకు. దాన్ని గదిలో కట్టేసి వచ్చాను." వెనుదిరిగి చూడకుండా నడిచాడు గంగారాం.

చేష్టలుదక్కి చూస్తూ ఉండిపోయాడు అతను. అతని చేతిలో నోట్ల కట్ట అతనికి ఎన్నో కొత్త అర్థాలు చెప్తోంది. భవిష్యత్తు బంగారు రంగుల కలలా కనిపిస్తోంది. తుదిసారిగా ఆ ఊరికి వీడ్కోలు చెప్పి కదిలాడు.

** ** **

ఆరు నెలలు గడిచిన తరువాత అహల్య పేర ఒక ఉత్తరం వచ్చింది. ఆత్రుతగా విప్పి చూసింది. అది శిల్పి దగ్గర నుంచి వచ్చింది.

"అహల్యా!

ఆ రోజు అలా పారిపోయి వచ్చినందుకు మీరు నన్ను అసహ్యించుకుంటారని నాకు తెలుసు కాని అవసరం, స్వార్థం - నా నిర్ణయాన్ని మార్చుకునేలా చేశాయి.

గంగారాం గారి మూడవ భార్యగా మీ పరిస్థితి నాకు తెలుసు. కాని... ముసలి తల్లిదండ్రులు, పెళ్ళి కాని చెల్లెళ్ళు ఇవన్నీ నన్ను మీ నుంచి దూరం చేశాయి.

ఆనాటి రాత్రి మీకోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నాను. మీరు రాలేదు - గంగారాం గారు వచ్చారు. ఆయన నాకు యాభై వేలిచ్చారు. క్షణాలలో నా నిర్ణయం మారిపోయింది. మీకు అందనంత దూరం పారిపోయాను. మీరు నన్ను శపిస్తారని తెలుసు. కానీ ఏమీ చెయ్యలేని నిస్సహాయుణ్ణి.

అహల్యా! ఇంకొక్క విషయం - ఆనాడు మీ మనోజ్ఞ రూపాన్ని చిత్రం గీశాను. మీకు గుర్తుండే ఉంటుంది. అది అఖిల భారత చిత్ర కళా పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకుంది? యాభై వేల రూపాయల నగదు బహుమతి గెలుచుకుంది. ఇప్పుడు నేను లక్షాధికారిని.

అహల్యా! ఒక్క విషయం మరిచాను - చిత్రం పేరు 'స్వప్న రాగిణి.'

ఇక ఉంటా!

మీకు ఎప్పటికీ, ఏమీ కాని శిల్పి.

ఉత్తరం చదవడం ముగించిన అహల్య కళ్ళ నుంచి వెచ్చని నీటి బిందువులు జల జల రాలాయి. ★

## రాళ్ళు

"తెల్లని గులకరాళ్ళు ఎక్కడుంటాయి రాజూ?" పూర్ణిమ టీచర్ అడిగింది. "రేషన్ బియ్యంలో టీచర్" రాజు జవాబు.

-ఉప్పుగంటి

కాలం కథ

# బిజినెస్

గణగణ టెలిఫోన్ మోగింది.

"హల్లో! ఆనంద్ స్పీకింగ్" అన్నాడు వెంటనే వెళ్ళి రిసీవర్ పైకెత్తి.

"గుడ్ మార్నింగ్ డార్లింగ్-అనితా స్పీకింగ్."

"వెరి గుడ్ మార్నింగ్ అనితా డార్లింగ్! నీకే నేను ఫోన్ చేద్దామనుకుంటున్నాను."

"థాంక్యూ."

"నిన్న మా డాడీ మీ ఇంటి కొచ్చారటగా డార్లింగ్?"

"అవును, అది చెప్పడానికే ఇప్పుడు మీకు ఫోన్ చేసింది. మీ నాన్నగారు తన మంకు పట్టు విడవడం లేదు. ఇంకా బేరం చేస్తూనే ఉన్నారు."

"అంటే?" ఆత్రతగా అడిగాడు ఆనంద్.

"ఏముంది? మూడు లక్షల కట్నానికి పైసా కూడా తగ్గనంటున్నారు."

"మరి మీ నాన్న గారేమంటున్నారు?"

"ఏమంటారు? అంత డబ్బు ఇవ్వనంటున్నారు."

"మరెలా?"

"అంటే మన ప్రేమకు కొలమానం డబ్బేనంటారా? డబ్బుకు మించిన అనుబంధం మనిద్దరి మధ్య ఇంకేం లేదంటారా?"

"ఎలా అంటాను? మన పవిత్ర ప్రేమ మాటేమిటి?"

"అయితే, మనం స్వతంత్రించి పెళ్ళి చేసుకుందాం. ప్రేమనేది డబ్బుతో కొనే వస్తువు కాదనీ, పెళ్ళనేది సంతలో జరిగే వ్యాపారం కాదనీ, ఇదొక అపురూపమైన అనుబంధమనీ మన పెద్దలకు తెలియజేద్దాం."

"అనితా డార్లింగ్ తొందరపడకు!"

"మరి గత్యంతర మేమిటి?"

ఏముంది? మెల్లగా మీ డాడీకి నచ్చచెప్పు డార్లింగ్."

"ఆ పని మీరే చెయ్యొచ్చు గదా డార్లింగ్!"

"........"

"ఆనంద్, ఇంతకూ మీ అభిప్రాయ మేమిటి?"

"ఏముంది డార్లింగ్? మా నాన్న డబ్బు మనిషి-డబ్బు విషయంలో ఆయన రాజీపడే ప్రసక్తే లేదు. ఆ... అందుకే..."

"మరి మీరేమంటారు?"

"నేను అస్వతంత్రుణ్ణి-ప్లీజ్! ఎలాగైనా మీ డాడీని ఒప్పించు డార్లింగ్!"

"మా నాన్న పక్కా బిజినెస్ మాన్. ఆయన మీకు రేటు కట్టాడు. ప్రస్తుతం మార్కెట్ రేట్ల ప్రకారం మీ రంత పలకరట. మూడు లక్షలకు మీకంటే అందగాణ్ణీ, విద్యావంతుణ్ణీ, ధనవంతుణ్ణీ కొనుక్కోవచ్చునని మా డాడీ బల్లగుద్ది చెప్తున్నారు." ఠపీమని ఫోన్ పెట్టేసింది అనిత.

యస్సార్ తురగా